సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 9 । జనవరి । 2024



నేత్రపర్వం.. శ్రీవారి ఉత్సవం

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా చినవెంకన్న తిరువీధి సేవలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పిస్తున్నారు.



కేవీకేలో శిక్షణ

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో తేనెటీగల పెంపకం, పండ్లు, కూర గాయలు, పూల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ప్రారంభమైంది.



విశేష అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో 150 కిలోల ద్రాక్షతో స్వామిని విశేషంగా అలంకరించారు. పంచ హారతుల కార్యక్రమం ఘనంగా జరిగింది.

పంట నష్టం లెక్క తేలింది

సాయం.. వేగిరం

- సాగు చివరిలో మిచాంగ్ దెబ్బ
- జిల్లాలో 30,459 రైతులకు చెందిన 37,118 ఎకరాల్లో నష్టం
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.25.24 కోట్లకు ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి నివేదించిన జిల్లా యంత్రాంగం
- త్వరలో రైతులకు అందనున్న సాయం

సాక్షి, భీమవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ అందనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టంపై జిల్లా యంత్రాంగం ఇప్పటికే నివేదికను అందజేసింది. జిల్లాలో 30,459 మంది రైతులకు చెందిన 37,118 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు ప్రత్యేక బృందాలు లెక్కతేల్చాయి. వారికి ఇన్‌పుట్ సబ్సిడీగా ప్రభుత్వ సాయం అందించేందుకు రూ.25.24 కోట్లు అవసరమని గుర్తించాయి.

తొలకరి చివరిలో..

తొలకరి చివరిలో మిచాంగ్ తుపాను కారణంగా రోజుల తరబడి పంట పొలాలు నీట మునిగిపోవడంతో వరి పంటకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందించి ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్టం అంచనాల తయారీకి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పరిపాలన శాఖల నుంచి గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేశారు. ఎనిమిది రోజుల పాటు కమిటీలు జిల్లాలోని తుపాన్ ప్రభావిత 289 గ్రామాల్లో పర్యటించి పంట నష్టం లెక్కించాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు 33 శాతానికి పైగా 30,459 మంది రైతులకు చెందిన 37,118 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు గుర్తించాయి. వీరిలో 28,402 మంది సన్న, చిన్నకారు రైతులకు చెందిన 31,147 ఎకరాల్లో నష్టం వాటిల్లగా, 2,057 మంది పెద్ద రైతులకు చెందిన 5,971 ఎకరాలు ఉన్నాయి.

ఎకరాకు రూ.6,800 చొప్పున

జిల్లాలో ముందుగా వరికోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, గణపవరం, పెనుగొండ మండలాల్లో పంట నష్టం తక్కువగా ఉండగా కోతలు ఆలస్యమైన నరసాపురం, పాలకొల్లు, పోడూరు, ఆచంట తదితర మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.6,800 చొప్పున రూ.25.24 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉందని గుర్తించారు. పంట నష్టంపై సోషల్ ఆడిట్ అనంతరం వారం రోజుల క్రితం తుది నివేదికను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. పంట నష్టపోయిన రైతులకు త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందనుంది.



పొలం వద్దకు వెళ్లి పంట నష్టం పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రభుత్వానికి నివేదిక



మిచాంగ్ తుపానుతో ఖరీఫ్ పంటకు వాటిల్లిన నష్టంపై ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందుతుంది.

–జెడ్.వెంకటేశ్వరరావు, జేడీ, వ్యవసాయశాఖ

పంట నష్టం వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం హెక్టార్లలో..	ఇన్‌పుట్ సబ్సిడీ రూ.కోట్లలో
భీమవరం	1,079	732.97	1.25
పాలకోడేరు	1,030	633.35	1.08
వీరవాసరం	2,467	1,188.12	2.02
ఆకివీడు	797	415.36	0.71
ఉండి	1,119	691.31	1.17
కాళ్ల	1,087	614.24	1.04
తాడేపల్లిగూడెం	53	33.09	0.05
పెంటపాడు	329	121.71	0.20
గణపవరం	797	481.61	0.81
తణుకు	250	103.65	0.17
ఇరగవరం	2,746	1,239.82	2.10
అత్తిలి	2,475	1,020.35	1.73
పెనుగొండ	1,009	424.32	0.72
పెనుమంట్ర	2,350	1,151.21	1.95
ఆచంట	2,972	1,277.29	2.17
పాలకొల్లు	2,408	967	1.64
పోడూరు	2,796	1,270.16	2.15
నర్సాపురం	2,572	1,423.85	2.42
మొగల్తూరు	234	88.76	0.15
యలమంచిలి	1,889	969.2	1.64

న్యూస్‌రీల్

ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని రెండు మెడికల్ ల్యాబ్‌లను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు, ధరల పట్టిక, ఫైర్ ఎగ్జిస్ట్, ల్యాబ్‌లో పనిచేస్తున్న సిబ్బంది విద్యార్హతలు, గుర్తింపు సర్టిఫికెట్ తదితర వివరాలు పరిశీలించి సూచనలు చేశారు. ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్ లేకపోయినా, రెన్యూవల్ చేయించకపోయినా సీజ్ చేస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎంఆర్‌కే రాజు ఆయన వెంట ఉన్నారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

భీమవరం: స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రవిప్రకాష్ అన్నారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమారావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 11 మంది అర్జీలు అందజేశారు. ఆయా ఫిర్యాదులపై సత్వర విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించారు. కట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షలకు 62 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో సోమవారం నిర్వహించిన డీఈఎల్‌డీ 2వ సెమిస్టర్ పరీక్షలకు 64 మందికి 62 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

రేపు కబడ్డీ సెలెక్షన్స్

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను తణుకు మండలం మండపాకలో ఈనెల 10న నిర్వహిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కౌరు శ్రీను, చైర్మన్ అప్పలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, పురుషులు 70 కిలోలలోపు, మహిళలు 65 కిలోలలోపు బరువు, 2004లోపు పుట్టిన వారై ఉండాలన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్ 94913 33906, 96424 96117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి

ఏలూరు టౌన్: ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏలూరులోని డీఐజీ కార్యాలయానికి హాజరుకావాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టులకు సివిల్, ఏపీఎస్పీ అభ్యర్థులు ఈనెల 10, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి హాజరుకావాలన్నారు. సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ధ్రువీకరణ పత్రాలను పూర్తి చేయడంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఈనెల 18 వరకు సంక్రాంతి సెలవులు మంజూరు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని మిషనరీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18 వరకు సెలవులు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు పునః ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. సెలవు దినాల్లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ల ద్వారా ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఆస్తులను కాపాడాలని సూచించారు. పాఠశాలల్లో ఎట్టి పరిస్థితుల్లో తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్ : పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు ఈ.లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిరణ్‌కృష్ణ సూచించారు. లంకలకోడేరు హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, స్టాకు నిల్వలను పరిశీలించారు. 750 మంది విద్యార్థులకు 550 మంది భోజనం చేశారని, మొత్తం విద్యార్థులంతా ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాలకొల్లులో రేషన్ దుకాణం, రేషన్ వాహనాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల గిడ్డంగిని పరిశీలించి స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం.శివప్రసాద్, డీఎస్‌ఓ సరోజిని, ఏఎస్‌ఓ రవిశంకర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, డీవైఈవో శ్రీరామ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడీ సుజాతారాణి, ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్లు కె.కృష్ణారావు, చెన్నయ్య, సీడీపీవో సీహెచ్ ఇందిర, ఎంఈఓ గంగాధరశర్మ వారి వెంట ఉన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్) : స్పందన ద్వారా వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పక పరిష్కారం చూపాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. 289 అర్జీలను స్వీకరించామన్నారు.

చెరువును కలుషితం కాకుండా..

వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన కేతా లక్ష్మీదుర్గ స్పందనకు వచ్చి గ్రామంలోని మంచినీటి చెరువుకు ఆనుకుని చికెన్ షాపు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దాని వల్ల మంచినీటి చెరువు కలుషితమయ్యే ప్రమాదం ఉందని చెరువుకు ఆనుకుని ఎటువంటి షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి డాక్టర్ ఆర్వీ ఆనందకుమార్, డీఆర్‌డీఏ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాదయాదవ్, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ అప్పిలేటు సభ్యుడు మేళం దుర్గాప్రసాదు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: రాష్ట్రంలో ప్రతిపక్షనేత చంద్రబాబు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం రేలంగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీఆర్ బాండ్ల గురించి మాట్లాడుతున్న చంద్రబాబు రాష్ట్రంలో టీడీఆర్ బాండ్లు తిరుపతి, విజయవాడ, విశాఖలో ఇచ్చి తణుకులో ఎలా అవినీతికి పాల్పడ్డారో దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. గతంలో చంద్రబాబు నిర్వహించిన రైతు పోరుబాటకు నాలుగు వందల మంది జనం కూడా రాలేదన్నారు. ఆచంటలో పెట్టిన బహిరంగ సభకు కూడా తక్కువ సంఖ్యలోనే ప్రజలు వచ్చారన్నారు. రైతులకు ధాన్యం సంచులు అందించలేదని చెబుతున్న చంద్రబాబు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. రైతులకు 1.14 కోట్ల ధాన్యం సంచులు అందించామన్నారు. లక్ష్యానికి కంటే మించి 10 లక్షల సంచులు అదనంగా ఇచ్చామన్నారు.

రైతులకు అన్నివిధాలా మేలు

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు ధాన్యం గురించి, సంచుల గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో 17.94 లక్షల మంది రైతుల నుంచి 2.65 కోట్ల టన్నుల ధాన్యం సేకరించగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పటివరకు 36.60 లక్షల మంది రైతుల నుంచి 3 కోట్ల 33 లక్షల 86 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. గతంలో దళారుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతుల నడ్డివిరవగా ఇప్పుడు రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో తడిసిన, మొక్క వచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశామని చెప్పారు. రైతులకు మేలు చేస్తున్నాం కాబట్టే సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారన్నారు. అనంతరం రైతులతో కలిసి ఆయన సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తణుకు నియోజకవర్గ నాయకులు చిట్టూరి సుబ్బారావు, పులుపు శ్రీను, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, బుద్ధారాతి భరణి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రేలంగిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి కారుమూరి, రైతులు

కాపులకు పితాని సమాధానం చెప్పాలి

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు డిమాండ్

పెనుగొండ: ఎప్పుడూ కాపులను అవమానిస్తూ, వారిని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న అవినీతిపరుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ టీడీపీ రా.. కదలిరా సభలో మరోసారి కాపులను అవమానించారని, దీనికి కాపు జాతికి సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచంటలో రా.. కదలిరా సభ పూర్తిగా విఫలమైందన్నారు. రా అన్నా, బతిమాలినా జనాలు తిరస్కరించారన్నారు. దీంతో మాజీ మంత్రి పితాని ఎన్నికల ముందే నైతికంగా ఓడిపోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి కళ్ల ముందు కనిపిస్తుంటే మాజీ మంత్రి పితాని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతో హీన స్థాయికి దిగజారి విమర్శలు చేస్తున్నారన్నారు. అవినీతిలో కూరుకుపోయిన పితాని, ఆయన తనయుడు తనపై బురద మరకలు అంటించాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుటిల యత్నాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అధికారంలో ఉన్నపుడు కమీషన్లు దండుకొని, సభలు నిర్వహించడానికి చందాలు వసూలు చేయాలంటూ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేయడం హాస్యాస్పదమని, దీంతో కార్యకర్తలు నానా అవస్థల పాలవుతున్నారని మండిపడ్డారు.

జనసేన ఇన్‌చార్జికి ఆహ్వానం ఇవ్వలేదా?

రా.. కదలిరా సభకు ఆచంట జనసేన ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాశ్ ఎందుకు రాలేదు.. ఆయనకు ఆహ్వానం ఇవ్వలేదా అన్ని శ్రీరంగనాథరాజు ప్రశ్నించారు. పొత్తు అంటూనే కనీసం ఎక్కడా చేగొండి ఫ్లెక్సీ లేకపోవడం విశేషమన్నారు. జనసేన శ్రేణుల జెండాలను టీడీపీ క్యాడర్ లాక్కొని విసిరేసినా పితాని కిమ్మనకపోవడం విడ్డూరమన్నారు. 30 ఏళ్లుగా బీసీలు, కాపులకు మధ్య చిచ్చు పెట్టి పితాని పబ్బం గడిపారన్నారు. గతంలో జెండా లేదు.. ఏజెండా లేదంటూ జనసేనను విమర్శించిన ఘనత పితానికే దక్కుతుందన్నారు. ఇప్పుడు సైతం అంతర్గతంగా కాపులపై నిందలు మోపుతూనే పైకి నటిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పితానిని మరోసారి ఓడిస్తానని, గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీపీ సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు కర్రిగొరీ సుభాషిణి, గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్‌లు కోట సరోజనీ, జక్కంశెట్టి చంటి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

33 మంది సీఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో భారీగా పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)లకు స్థానచలనం కలిగింది. 33 మంది సీఐలను బదిలీలు చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్దెత్తున బదిలీలు చేపట్టినట్టు తెలుస్తోంది. పలువురిని విజయవాడ కమిషనరేట్‌కు పంపగా, ఎక్కువ మందిని వీఆర్‌లో పెట్టారు.

సీఐ	ప్రస్తుతం	బదిలీ
ఎస్ఎస్ఎస్‌వీ నాగరాజు	తాడేపల్లిగూడెం	విజయవాడ, కమిషనరేట్
బలుమూరి వెంకటేశ్వరరావు	జీలుగుమిల్లి	విజయవాడ, కమిషనరేట్
కె.శివాజీ	వీఆర్, ఏలూరు జిల్లా	విజయవాడ, కమిషనరేట్
ఎ.సుబ్రహ్మణ్యం	విజయవాడ–టూటౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణమోహన్	గుణదల, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పెరవలి రామచంద్రరావు	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
అబ్దుల్ సలామ్	ట్రాఫిక్–వన్‌టౌన్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీబీ మురళీకృష్ణ	విజయవాడ, ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
వి.జానకిరామయ్య	విజయవాడ ట్రాఫిక్	వీఆర్, ఏలూరు రేంజ్
కేవీ కృష్ణకుమార్	ఎస్ఈబీ, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.కృష్ణ	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.సత్యానందం	సైబర్‌క్రైమ్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
బీహెచ్ వెంకటేశ్వర్లు	ఎస్ఆర్ పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎ.నాగమురళీ	గవర్నర్‌పేట, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎంవీ దుర్గారావు	కృష్ణలంక, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.శ్రీనివాసరావు	నున్న, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.సుధాకర్	ట్రాఫిక్–1, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
కె.క్రిష్టాఫర్	ట్రాఫిక్–2, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.రామ్‌కుమార్	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
పి.శ్రీనివాసరావు	సీసీఎస్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
జీవీ వినయ్‌మోహన్	పీసీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
ఆర్.అంకబాబు	వీఆర్, విజయవాడ	వీఆర్, ఏలూరు రేంజ్
వైఆర్‌కే శ్రీనివాస్	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం, కాకినాడ జిల్లా
పీవీజీ తిలక్	కడియం, తూర్పుగోదావరి	డీఎస్‌బీ, వెస్ట్‌గోదావరి
కె.అప్పలస్వామి	వీఆర్, ఏలూరు రేంజ్	నరసాపురం పట్టణం
జి.శ్రీనివాసయాదవ్	నరసాపురం పట్టణం	ఉయ్యూరు, కృష్ణా జిల్లా

ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి

ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు రూరల్: రాష్ట్రంలో ఫుట్‌బాల్‌కు మరింత ఆదరణ తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఈనెల 6 నుంచి నిర్వహిస్తున్న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన కొల్లేరు జోన్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు మరింత ఆదరణ పెరిగిందన్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లో బాలబాలికలు సైతం ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకుంటున్నారన్నారు. ఆటకు మరింత ప్రజాదరణ కల్పించేందుకు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ క్లబ్ చాంపియన్‌షిప్ పోటీలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ప్రతి జోన్‌లో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మణిశంకర్ మాట్లాడుతూ కొల్లేరు జోన్‌లో పశ్చిమ, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పలు జట్లు పాల్గొన్నాయన్నారు. మొత్తంగా 15 మ్యాచ్‌లకు గాను 9 మ్యాచ్‌లు నిర్వహించగా, ఏలూరు క్లబ్, సంగీతం మెమోరియల్ జట్లు అత్యధిక పాయింట్లు సాధించాయన్నారు. మిగిలిన 6 మ్యాచ్‌లు విజయవాడలో నిర్వహిస్తామన్నారు. కార్యదర్శి జీఎస్ఎస్ పవన్‌కుమార్‌తో పాటు అసోయేషన్ సభ్యులు పీడీ ప్రదీప్, సాగర్, కె.శ్రీకాంత్, ఆలీబాబా, ఎం.అనిల్‌కుమార్, ఎం.రాంబాబు, పి.ఆలీబాబా తదితరులు ఎంపీ శ్రీధర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. డీఎస్‌డీఓ బి. శ్రీనివాసరావు పోటీలను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

235 మంది బైండోవర్

భీమవరం: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదం నివారించేందుకు భీమవరం రూరల్ సర్కిల్ పరిధిలో 235 మందిని బైండోవర్ చేశామని సీఐ వై.సత్యకిషోర్ సోమవారం చెప్పారు. కోళ్లకు కత్తులు కట్టే 14 మంది, కోడి పందేల బరి నిర్వహించే 8 మంది యజమానులు, జూదాలు నిర్వహించే 16 మంది, పాత నేరస్తులు 197 మందిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల ష్యూరిటీ బైండోవర్ చేశారని తెలిపారు. పందేలు, జూదాలు నిర్వహించవద్దంటూ హెచ్చరిక బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా జూదం, కోడిపందేలు నిర్వహిస్తే 94407 96645 ఫోన్ నంబర్‌కు తెలియపర్చాలని సీఐ కోరారు.

రూ.30 కోట్లు ఇవ్వు.. ఇల్లు రాసిస్తా

చంద్రబాబుకు
విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సవాల్


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): రూ.30 కోట్లు ఇస్తే తాను కట్టుకుంటున్న ఇల్లు రాసిస్తానని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టీడీపీ అధినేత చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఆచంటలో జరిగిన టీడీపీ సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ భీమవరంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలన్నారు. తనకు సొంతిల్లు లేదని, తమ్ముడు ఇంట్లో ఉంటున్నానని, స్థలం కొనుగోలు చేసుకోవడానికి డబ్బులు లేక తాతలు ఇచ్చిన స్థలంలోనే నిబంధనల ప్రకారం తాను బ్యాంకు లోన్ తీసుకుని ఇంటిని నిర్మించుకుంటున్నానని తెలిపారు. తాను భూ ఆక్రమణలు చేసినట్లు చంద్రబాబు ఆర్ఎస్ నంబర్లతో సహా నిరూపించాలన్నారు. రూ.50 కోట్లు పెట్టి ప్యాలెస్ కట్టుకుంటున్నానన్న చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డారు. తనకు రూ.30 కోట్లు ఇస్తే ప్రస్తుతం కట్టుకుంటున్న తన ఇంటిని చంద్రబాబుకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేస్తానన్నారు. చంద్రబాబు జీవితం అంతా అబద్ధాలు, మోసపూరిత హామీలు, తప్పుడు ప్రచారాలే ఉంటాయన్నారు. ప్రజలకు మేలు చేయడం తప్ప మోసం చేయడం తనకు తెలియదన్నారు. గత నాలుగున్నరేళ్లలో భీమవరం నియోజకవర్గాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు.

ముగ్గురు ఇంటర్ విద్యార్థులు దుర్మరణం

- విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న బైక్
- మాధవరంలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..


బండ్రెడ్డి లీలా భాను (ఫైల్)


బండారు సాయిగణేష్ (ఫైల్)


బండ్రెడ్డి శివ (ఫైల్)


మాధవరం జెడ్పీ హైస్కూల్‌లో మృతుల స్నేహితులను విచారిస్తున్న రూరల్ సీఐ మూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన మాధవరంలో ఆలస్యంగా వెలుగుచూసింది. శనివారం అర్ధరాత్రి ప్రమాదం జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుల్లో బండ్రెడ్డి శివప్రసాద్ (17), బండారు సాయిగణేష్ (17), బండ్రెడ్డి లీలా నరసింహా (17) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అదేరోజు రాత్రి మృతదేహాలను ఖననం చేసినట్టు సమాచారం. మృతులు తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సోమవారం తాడేపల్లిగూడెం రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై బి.రాజు మాధవరం గ్రామం వెళ్లి మృతుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు ఆరా తీశారు. మృతదేహాలను ఖననం చేసిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లేనంటూ గ్రామస్తులు ఆగ్రహం
- పాలి గ్రామంలో ఘటన


పాలిలో చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు


వాడపల్లి శ్రీవల్లి (ఫైల్)

అత్తిలి: పాలి గ్రామంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఐదేళ్ల చిన్నారి బలైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వాడపల్లి శ్రీవల్లి (5) అత్తిలిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. ప్రతి రోజు స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లివస్తోంది. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం స్కూల్ బస్సులో ఇంటికి బయలుదేరింది. పాలి గ్రామంలో మెయిన్‌రోడ్డుపై స్కూల్ బస్సు ఆగగా, తోటి విద్యార్థులతో కలిసి దిగి బస్సు ముందుభాగం నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో బస్సు డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో అదే బస్సు కింద పడి శ్రీవల్లి అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీవల్లితో పాటు ఇదే పాఠశాలలో సోదరుడు శివబాలాజీ ఒకటో తరగతి చదువుతున్నాడు. చిన్నారి తండ్రి ధర్మరాజు వ్యవసాయ కూలీ కాగా, తల్లి గృహిణి. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటనా ప్రదేశానికి ఎస్సై వి.రాంబాబు వెళ్లి వివరాలు సేకరించారు. స్కూల్ బస్సు రెగ్యులర్ డ్రైవర్ సెలవు పెట్టడంతో సోమవారం కొత్త డ్రైవర్‌ను పంపినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. బస్సులో కనీసం క్లీనర్ కూడా లేకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు చెప్పారు.

నన్నయ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నన్నయ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని పలు కళాశాల నుంచి ప్రతిభ కనపర్చిన పది మంది క్రీడాకారులను వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో విశ్రాంత కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, విశ్రాంత జువాలజీ అధ్యాపకులు రామారావు, టోర్నమెంట్ పీడీ అంజిబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జె.విజయబాబు, వర్సిటీ అబ్జర్వర్ దేవానంద్, కమిటీ సభ్యులు మోహనరావు, ప్రసాద్ పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో భిక్కవోలు ప్రజ్ఞ డిగ్రీ కళాశాల, పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రిలోని ఎస్‌కే వైటీ డిగ్రీ కళాశాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కాగా ఫిబ్రవరిలో బెంగళూరు నార్త్ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించే పోటీల్లో నన్నయ వర్సిటీ జట్టు పాల్గొంటుందని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు.

క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రికి అభినందనలు



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు అభినందనలు చెబుతున్న క్రిస్టియన్ మైనారిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సోమవారం తాడేపల్లిగూడెం మంత్రి కార్యాలయంలో ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రం జార్జ్ బెనహార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గెద్దం జ్యోతి ఆనంద్, ఉపాధ్యక్షుడు పి.సంపదరావు, బేతాళా సంతోష్, సెక్రటరీలు మెడవంకల రత్నకుమార్, ప్రిన్స్ ప్రేమ్ సన్, కందికట్ల ఎడ్వర్డ్ గాదేపాల్ సుధీర్, మేడిద శ్యామ్, స్టాన్లీ రాబర్ట్, మోసాల ఆశోక్, బొంతు శ్యాంబాబు, ర్యాలీ రత్నకుమార్, కత్తుల జస్పాల్, జాయింట్ సెక్రటరీలు రొక్కాల నాగబుజ్జి, వెంద్రపాటి మోహన్‌రావులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉంటే ఆదర్శ అవార్డును రొక్కాల నాగ బుజ్జికి మంత్రి అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధ మహిళకు పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బోధిగట్టు 23వవార్డు వృద్ధురాలు తుర్ల సావిత్రి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ రాజమండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒంటరి మహిళా, వృద్ధురాలు కావడం, ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న దృష్ట్యా వార్డు వలంటీర్ దిర్సాల వరలక్ష్మి సోమవారం రాజమండ్రికి వెళ్లి ఆమెకు రూ.3వేలను పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు వలంటీర్‌ని సేవలను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఇరగవరంలో రెండోరోజు ప్రారంభమైన ప్రజా దీవెనయాత్ర



రేలంగిలో సచివాలయ భవన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో ఆయన చేపట్టిన ప్రజా దీవన యాత్ర రెండో రోజు కొనసాగింది. పాదయాత్రలో దారి పొడవునా మంత్రికి మహిళలు, హారతులిచ్చి ఘన స్వాగతం పలకగా వృద్ధులు తమ ఆశీస్సులు అందించారు. తామంతా మీ వెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్తకంఠంతో తెలిపారు. స్థానికులు తెలిపిన సమస్యలు విని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేలంగిలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఎంపీటీసీ మెట్ల కిరణ్మయి, మహాలక్ష్మి, మెంట రాజు, నాయకులు చెబ్రోలు పెద్దిరాజు, పులుపు అనిల్, పులుపు సునీల్, పులుపు అక్కమాంబ, పులుపు శ్రీను, వడ్డే మార్కెండేయులు, మైనం పాము, బాబీ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేలంగి గ్రామంలో దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మాల మహానాడు నాయకు చీకటిమిల్లి మంగరాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, చేబ్రోలు పెద్దిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్ ప్రయాణం హామీ ఇవ్వవద్దు

తణుకు అర్బన్ : పట్టణంలో ఆటో కార్మికులందరూ సోమవారం ఉదయం నుంచి నిరసన వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామనడం ఆటో కార్మికుల పొట్ట కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ఆటో యూనియన్ జేఏసీనాయకులు రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ):ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్‌ప్రయాణాలు వంటి హామీలతో ఆటోవాలాలకు ఉపాధి దెబ్బతింటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లిగూడెం ఏరియా ఆటో కార్మికులు బంద్ నిర్వహించి నిరసన శిబిరాల్లో ఆందోళనలు నిర్వహించారు.

బాధితులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పెదముత్తి ముసలయ్య కుటుంబానికి గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్టీలు సామగ్రిని అందజేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

పెంటపాడు: దాతలు అందించిన సాయంతో విద్యార్థులు ఉన్నతంగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల వెంకట కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం పెదవెల్లమిల్లికి చెందిన కంభంపాటి సుబ్బారావు, పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు అందించిన విద్యాసామగ్రిని విద్యార్థులకు సర్పంచ్ అందజేశారు.

తణుకులో విస్తరిస్తున్న వైద్యరంగం

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు పట్టణంలో ప్రైవేటు ఆస్పత్రులు సైతం అధునాతన వసతులతో తీర్చిదిద్దబడ్డాయి. వైద్యరంగంలో తాజాగా వచ్చిన నూతన ఆవిష్కరణలకు సంబంధించిన సౌకర్యాలు తణుకులో అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వచ్చే వారికి అత్యవసర విభాగాలు నాణ్యమైన సేవలందిస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే తణుకు ప్రాంతంలో ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాల నుంచి సైతం తణుకు వచ్చి స్థిరపడే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతం తమ పరిధి పెంచుకుంటూ అభివృద్ధి చెందుతుంది. దీంతో నగరాల నుంచి సైతం వైద్యులు తణుకులాంటి ప్రాంతంలో అధికసంఖ్యలో హాస్పిటల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

అధునికి వైద్య సౌకర్యాలతో ఆస్పత్రులకు నిలయం

హాస్పిటల్స్ హబ్‌గా పేరుగాంచుతున్న తణుకు పట్టణ ప్రాంతంలో సుమారుగా 70కి పైగా ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి. గతంలో సుదీర్ఘ వ్యాధుల చికిత్సలకైనా, అత్యవసర వైద్య సేవల కోసమైనా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చేది. కానీ నేడు గుండె, న్యూరో, నెఫ్రాలజీ, యూరాలజీలతో పాటు అంకాలజీ వంటి వైద్య సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా తణుకు పట్టణ ప్రాంతం జాతీయ రహదారికి అనుకుని ఉండడంతో ఎక్కువ శాతం ప్రమాదాలకు సంబంధించి కేసులు వస్తుంటాయి. ఈ ప్రమాదాల్లో అధిక శాతం హెడ్ ఇన్‌జ్యూరీలతోపాటు ఆర్థోపెడిక్ విభాగాల్లో నాణ్యమైన వైద్యసేవలు అవసరమవుతుంటాయి. ఈ సేవలన్నీ తణుకులో వివిధ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.



తణుకులో స్వాగతం తెలిపే ముఖద్వారం



వైద్య రంగంలో ముందంజ



తణుకులో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. అధునిక వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడంతో రోగు లు దూర ప్రాంతాలకెళ్లే పనిలేకుండా స్పెషలిస్టులు వైద్య సేవలు పొందుతున్నారు. అరుదైన శస్త్రచికిత్స లు కూడా తణుకు డాక్టర్లు చేస్తున్నారు. దీంతోపాటు జనరల్ సర్జరీల్లో గతంలో మాదిరిగా ఓపెన్ సర్జరీలకు తావులేకుండా లేటెస్ట్ పరికరాలతో లాప్రోస్కోఫిక్ సర్జరీ విధానంకూడా అందుబాటులో ఉంది. ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియల్ సర్జరీలుకూడా ఆవిష్కరించబడ్డాయి.

– డాక్టర్ నిమ్మగడ్డ ప్రదీప్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు, తణుకు